క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు ఓల్డ్ హౌజింగ్ బోర్డు, టీచర్స్ కాలనీ, సప్తగిరి కాలనీ, కైలాస్‌నగర్, కలెక్టర్ చౌక్, రిమ్స్ ఆస్పత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.
బోథ్: బోథ్, పొచ్చెర విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో శనివారం మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ వెంకటేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

11న కార్యవర్గ సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని దస్నాపూర్ సరస్వతీనగర్‌లో గల సంఘ భవనంలో నాయీబ్రాహ్మణ సేవ సంఘం సమావేశాన్ని ఈనెల 11న నిర్వహిస్తున్నట్లు నాయకులు జెక్నెవార్ అంజయ్ కుమార్, మండపెల్లి శ్రీనివాస్, లింగం పల్లి రాములు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికపై చర్చించడం జరుగుతుందన్నారు.

ఘనంగా పెద్ద పండగ

నేరడిగొండ: మండలంలోని వడూర్ గ్రామంలో పెద్ద పండుగ కొనసాగుతోంది. శుక్రవారం విగ్రహాల ఊరేగింపు నిర్వహించి, ప్రతిష్ఠించారు. పురవీధుల గుండా డప్పు చప్పుళ్లతో ర్యాలీ నిర్వహించారు. గ్రామంలో పాడిపంటలు సమృద్ధిగా పండి, పిల్లపాపలతో చల్లగా ఉండాలని ఈ పండుగ నిర్వహించడం జరుగుతుందన్నారు.

కంప్యూటర్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

బేల: వృత్తి నైపుణ్య మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో జనశిక్షణ సంస్థ సౌజన్యంతో అందించే ఉచిత కంప్యూటర్ శిక్షణను యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ డైరెక్టర్ శ్యామల తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఆసక్తి గల వారు ఆధార్‌కార్డు, ఫొటో, పదో తరగతి మెమోతో పేరు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 96664 09010 సంప్రదించాలని కోరారు.

'సస్పెండ్ చేయడం అన్యాయం'

ఆదిలాబాద్‌రూరల్: డీఆర్‌డీవో కిషన్ టెలి కాన్ఫరెన్స్‌కు హాజరు కాలేదనే సాకుతో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపాల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా సస్పెండ్ చేయడం అన్యాయమని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్లూరి భూమన్న, దాసరి బాబన్నలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
ఆదిలాబాద్‌రూరల్: టెలి కాన్ఫరెన్స్‌కు హాజరు కాలేదని డీఆర్‌డీవో కిషన్‌ను సంబంధిత శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తున్నామని టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్యాల మనోజ్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో మాట్లాడారు. షోకాజ్ నోటీసు జారీ చేయాలి కానీ సస్పెండ్ చేయడం సరికాదన్నారు. టీఎమ్మార్పీఎస్ జిల్లా కోశాధికారి లింగంపల్లి ప్రసన్నకుమార్, కత్తి గంగాధర్, రవికుమార్, నాందేవ్, సంజయ్, భూమన్న, ఆకాష్ పాల్గొన్నారు.

గిరిజనుల అభివృద్ధికి కృషి

ఇచ్చోడ: గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని సిరిచెల్మ గ్రామంలో గిరిజన లబ్ధిదారులకు పోడు పట్టాలు పంపిణీ చేశారు. గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వడమే కాకుండా వారికి రైతుబంధు ఇచ్చి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండాల లక్ష్మి, వైస్ ఎంపీపీ కొడప కమల జాలైజాకు, ఇచ్చోడ ఎంపీటీసీ జాహెద్, పంచాయతీ కార్యదర్శి రాజు పాల్గొన్నారు.

'విద్యా వ్యతిరేక విధానాలు మానుకోవాలి'

ఆదిలాబాద్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను మానుకోవాలని ఏఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు సలాం వరుణ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో మాట్లాడారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా నాయకులు మెస్రం వెంకటేశ్, చరణ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల నిరసన

ఆదిలాబాద్: జిల్లా గ్రంథాలయంలోని నిరుద్యోగ యువత, పాఠకులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. ప్రస్తుతం పోటీ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో 24 గంటల పాటు గ్రంథాలయాలను తెరిచి ఉంచాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయితే జిల్లా గ్రంథాలయాన్ని 24 గంటలు అందుబాటులో ఉంచకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు.

రాజకీయ భజన..

- పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్న ప్రభుత్వ ఉద్యోగులు
- తమకే టికెట్ అంటూ.. ప్రచారం
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు


బీఆర్‌ఎస్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగి


బట్టి విక్రమార్కను సన్మానిస్తున్న మహిళా ఉద్యోగి

ఇచ్చోడ: బోథ్ నియోజకవర్గంలో ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయ పార్టీ కార్యకర్తలు, నాయకుల్లా వ్యవహరిస్తున్నారు. చేసేది ప్రభుత్వ ఉద్యోగమనే ధ్యాసే లేకుండా పోయింది. కొంత మంది తూతూమంత్రంగా ఉద్యోగానికి హాజరై.. ఎక్కువ సమయం రాజకీయ భజనకు కేటాయిస్తున్నారు. నియోజకవర్గంలో రాజకీయ పదవులు పొందిన వారంతా ప్రభుత్వ ఉద్యోగాలు చేసిన వారే కావడంతో అడిగే వారే లేకుండా పోయింది. రాజకీయ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం, ప్రచారం చేయడం, పార్టీ టిక్కెట్ తమకే వస్తుందని ప్రచారం చేస్తున్నారు. తమ అనుచరులను వెంటబెట్టుకొని తిరుగుతూ.. హంగామా సృష్టిస్తున్నారు.

ట్రెండ్‌గా కొనసాగుతూ..

బోథ్ ఎస్టీ నియోజకవర్గంలో గోడం రామారావు, గోడం నగేశ్, సోయం బాపురావు, రాథోడ్ బాపురావులు ప్రభుత్వ ఉద్యోగాలకు రాజీనామాలు చేసి రాజకీయ పదవులు అనుభవిస్తున్న వారే. దీంతో అప్పటి నుంచి ఇదే ట్రెండ్ కొనసాగుతోంది. నియోజకవర్గంలో ప్రధాన పార్టీల నుంచి టిక్కెట్లు ఆశించే, ఆశావహులంతా ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నవారే కావడం గమనార్హం.

ప్రజల్లో జోరుగా చర్చ..

అసెంబ్లీ ఎన్నికలు సమీస్తున్న కొద్ది ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న ఆశావహులు ప్రభుత్వ ఉద్యోగులమన్న సంగతే మరిచి వ్యవహరిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీల కార్యక్రమాల్లో బహిరంగానే పాల్గొంటున్నారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారు టిక్కెట్లు ఆశించడంలో తప్పేమి లేదు కానీ ఉద్యోగాలకు రాజీనామాలు చేసి పాల్గొనాలని ప్రజలు చర్చించుకుంటున్నారు.

- నేరడిగొండ మండలానికి చెందిన జూనియర్ కళాశాల్లో అధ్యాపకుడిగా పనిచేసే ఒక్కరూ రెండు సంవత్సరాలుగా బీజేపీ నుంచి టిక్కెట్టు ఆశిస్తున్నాడు. నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తూ.. తనను ఆశీర్వదించాలని ప్రజలను కోరుతున్నాడు.
- నేరడిగొండ మండలంలోని రాజురా గ్రామానికి చెందిన మహిళ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సెరికల్చర్ లైజన్ అధికారిగా పనిచేస్తోంది. కాంగ్రెస్ నుంచి టిక్కెట్టు తనకే వస్తుందని, ప్రచారం చేసుకుంటుంది. గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ.. ప్రజా సమస్యలు తెలుసుకుంటుంది. పార్టీ పెద్దలను కలిసి, బహిరంగంగానే సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటున్నారు.
- బజార్‌హత్నూర్ మండలంలోని మహిళ సర్పంచ్ భర్త, గిరిజన కోఆపరేటివ్ (జీసీసీ) అకౌంటెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. అధికార పార్టీ కార్యక్రమాల్లో బహిరంగంగానే పాల్గొంటున్నాడు. జూలై 3న పంచాయతీ కార్యాలయం ప్రారంభ కార్యక్రమాలను ముందుండి నడిపించాడు.
- ఇలా నియోజకవర్గంలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు హైదరాబాద్‌లోని పార్టీ ముఖ్య నేతలను కలుస్తూ.. పార్టీ టికెట్ ఆశిస్తున్నారు. తము చేసే సేవ కార్యక్రమాలు, ప్రచారం గురించి అధినేతలకు వివరిస్తున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనే ఉద్యోగులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆత్మగౌరవ సభ విజయవంతం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకులు

ఇంద్రవెల్లి: ఇచ్చోడ మండల కేంద్రంలోని షార్ప్ గార్డెన్‌లో ఈనెల 17న బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే బహుజన ఆత్మ గౌరవ సభను విజయవంతం చేయాలని బీఎస్పీ నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. పేదల బతుకులు మారాలంటే బీఎస్పీతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు సోయం రాందాస్, పెందోర్ అంకుష్, వావల్కర్ శివాజీ, జొందలే విజయ్, సాయి, దీపక్ పాల్గొన్నారు.
తలమడుగు: బీఎస్పీ ఆధ్వర్యంలో ఇచ్చోడలో ఈనెల 17న నిర్వహించే బహుజనుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని బీఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తెర్ల లక్ష్మణ్ యాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో బహుజనుల ఆత్మగౌరవ సభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో బోకంటి అశోక్, గంగన్న, అరవింద్, గొంటి ముక్కుల ప్రసాద్, వినోద్, రాములు పాల్గొన్నారు.

'కక్షపూరితంగా వ్యవహరిస్తున్న ప్రధాని మోదీ'


ప్రధాని మోదీ ఫ్లెక్సీని దహనం చేస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: దేశం కోసం ప్రాణాలు త్యాగం చేసిన గాంధీ కుటుంబంపై కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ ఆరోపించారు. అనర్హత వేటుపై గుజరాత్ కోర్టులో వేసిన పిటిషన్‌ను కొట్టివేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట రాస్తారోకో నిర్వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫ్లెక్సీని దహనం చేసి, నినాదాలు చేశారు. ప్రజలు రాహుల్ గాంధీ వెంట ఉన్నారని, రానున్న ఎన్నికల్లో ఆయన ప్రధాని అవుతారని ధీమా వ్యక్తం చేశారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, సంజీవ్ రెడ్డి, భరత్ వాగ్మారే, నగేశ్, రూపేష్, రంగినేని కంతన్ రావ్, చరణ్ గౌడ్, నహీద్ పాల్గొన్నారు.

గ్రామాల్లో గడపగడపకూ కాంగ్రెస్

సిరికొండ: మండలంలోని సిరికొండ, పోన్న, సుంకిడి గ్రామాల్లో ఏఐసీసీ సభ్యులు నరేశ్‌జాదవ్ శుక్రవారం గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ.. రైతు డిక్లరేషన్ గురించి ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో దుర్మార్గపు పాలన కొనసాగుతోందని, కుటుంబపాలనకు ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ యువతకు ఉద్యోగాలు ఇవ్వకుండా మోసం చేస్తున్నాడని ఆరోపించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఇమామ్, మాజీ అధ్యక్షుడు కంచం లక్ష్మణ్, కుంరం కోటేశ్వర్, జాదవ్ వసంత్ రావు, రజనీకాంత్, మాధవ్ పటేల్ పాల్గొన్నారు.

'అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదు'

బేల: బీఆర్‌ఎస్ ప్రభుత్వం పాలనలో అర్హులకు పెన్షన్లు, రేషన్‌కార్డులు, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, సంక్షేమ పథకాలు అందడం లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత విమర్శించారు. శుక్రవారం మండలంలోని దేవ్‌జీగూడ, పోనాల, రంఖం గ్రామాల్లో జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్‌తో కలిసి పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ అధికారంలో రాగానే అమలు చేసే పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నాక్లే రాందాస్, ఫైజుల్లాఖాన్, సామ రూపేష్‌రెడ్డి, ఠాక్రే విపిన్ పాల్గొన్నారు.

బీజేపీని ఆదరించాలి..

నేరడిగొండ: రానున్న ఎన్నికల్లో బీజేపీని ఆదరించాలని బీజేపీ మండల ఇన్‌చార్జి మాధవ్ రావ్ ఆమ్టే కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీలో కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ.. కరపత్రాలు పంపిణీ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. బీఆర్‌ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సాబ్లే సంతోశ్‌సింగ్, పట్టణ అధ్యక్షుడు రాథోడ్ రాజశేఖర్, ఓబీసీ మోర్చా మండల కార్యదర్శి భాక్రే శేఖర్, సాయితేజ, సముద్రాల రతిశ్, బొదసు చిన్ననర్సింలు, జాదవ్ పవన్ కల్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అంబేద్కర్ భవన్ పత్రాలు అందించాలి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ అంబేద్కర్ భవన్‌కు సంబంధించి సమగ్ర భూమి, భవన పత్రాలు అందించాలని అంబేద్కర్ కమిటీ నాయకులు కోరారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో కదం సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు జగ్జీవన్, ఉపాధ్యక్షుడు కాంబ్లే ప్రజ్ఞశీల్, బొంకంటి సుభాశ్ పాల్గొన్నారు.

ఆవుకు చికిత్స

బోథ్: మండల కేంద్రంలోని భారతీయ స్టేట్ బ్యాంకు వద్ద ఆవును గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. రోడ్డుపై పడి లేవలేని స్థితిలో ఉంది. గమనించిన స్థానికులు పశువైద్య సంచార వాహనానికి సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన పశువైద్యులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆవుకు వైద్యం అందించారు. అనంతరం ఆవును యజమానికి అప్పగించారు.

గోకొండలో వైద్యశిబిరం

బజార్‌హత్నూర్: మండలంలోని గోకొండ గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్లు శిల్పా, అలేఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించారు. 66 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. వర్షాకాలం వేడిచేసి చల్లార్చిన నీటినే తాగాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉల్దారాణి, ఏఎన్‌ఎంలు మంజుల, అదిబా బేగం, జయమాల, రాధ, చాయాబాయి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఉట్నూర్‌రూరల్: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఈనెల 24న ఉట్నూర్ కేబీ ప్రాంగణంలో సమావేశం నిర్వహించడం జరుగుతుందని నాయకులు తెలిపారు. కేబీ ప్రాంగణంలోని స్పోర్ట్స్ పాఠశాల ఆవరణలో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు. నాయకులు కపిల్‌కుమార్ జాదవ్, మెస్రం గంగారాం, సత్యనారాయణ, శ్రీకాంత్, మాధవ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ఉట్నూర్‌రూరల్: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూటీఎస్ ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ సంఘాల నాయకులు శుక్రవారం ఐటీడీఏ పీవోను కలిసి విన్నవించారు. ఇందులో నాయకులు ఆడె ప్రకాశ్, భూమన్న, గోపాల్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నిర్మల్ ఎల్‌డీఎంగా రవీందర్

గుడిహత్నూర్: కాంగ్రెస్‌ను బలోపేతం చేసేందుకు పార్టీ అధిష్ఠానం ఏర్పాటు చేసిన లీడర్ డెవలప్‌మెంట్ మిషన్ నిర్మల్ ఇన్‌చార్జిగా మండలానికి చెందిన సీనియర్ నాయకుడు అంకతి రవీందర్ ఎన్నికయ్యారు. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వెన్నల అశోక్, మండల నాయకులు శుక్రవారం ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు. నాయకులు బాలాజీ సోంటక్కే, ముస్తాఫా, మజీద్, మాధవ్ ససానే, చట్ల మహేందర్, వసీంఖాన్ పాల్గొన్నారు.

బోథ్ ఎంపీడీవోగా సుశీల్‌రెడ్డి

బోథ్: బోథ్ ఎంపీడీవోగా సుశీల్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా విధులు నిర్వర్తించిన లక్ష్మణ్ స్థానంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోథ్ మండలాభివృద్ధికి పాటు పడుతానని అన్నారు. ఎంపీపీ తుల శ్రీనివాస్, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

నీటి నిల్వ లేకుండా చూడాలి

బోథ్: మండల కేంద్రంలో మలేరియా విభాగం అధికారి రవీందర్ రెడ్డి శుక్రవారం డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కాలనీల్లో పర్యటించి నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. ఇంటి పరిసరాల్లో నీటిని నిల్వ ఉంచుకోవద్దని సూచించారు. దీనివల్ల దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఆయన వెంట సిబ్బంది, తదితరులున్నారు.

రోడ్లు, వంతెనలకు మరమ్మతులు చేయండి

- జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య
- సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య

బజార్‌హత్నూర్: మండలంలో ఆర్‌అండ్‌బీ, పీఆర్ రోడ్లపై గుంతలు ఏర్పడి ప్రయాణానికి ఇబ్బందికరంగా మారిందని వెంటనే రోడ్లు, వంతెనలకు మరమ్మతులు చేయాలని జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య, ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌ను ఆదేశించారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ అజాడే జయశ్రీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మొదట ఆర్‌అండ్‌బీ అధికారులు వచ్చే వరకు సభ నిర్వహించవద్దని ఎంపీటీసీలు సభను బహిష్కరించారు. ఎంపీడీవో చౌహాన్ రాధ ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌ను రప్పించడంతో సభ సజావుగా సాగింది. జెడ్పీటీసీ నర్సయ్య మాట్లాడుతూ.. ఇచ్చోడ, సొనాల అంతరాష్ట్ర రహదారిలో కొలారి వద్ద వంతెన శిథిలావస్థలకు చేరిందన్నారు. ఎంపీటీసీ పండగ మురళీ మోహన్ మాట్లాడుతూ.. పిప్రి గ్రామంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు బురదమైమయంగా మారిందని, రూ.2 కోట్ల నిధులు మంజూరైనా.. రోడ్డు నిర్మాణం చేపట్టలేదని నిలదీశారు. వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. బజార్‌హత్నూర్ సమీపంలో వంతెన నిర్మించి బీటీ వేయలేదన్నారు. రాంపూర్, దేగామ వద్ద రోడ్డు కోతకు గురైందని వెంటనే మరమ్మతులు చేయాలని ఎంపీటీసీ సోన్‌టాకే గజానంద్ కోరారు. కంటి అద్దాలు ఇప్పటివరకు అందలేదని గంగాపూర్ సర్పంచ్ శ్రీరాం అన్నాడు. కార్యక్రమంలో ఎంపీడీవో చౌహాన్ రాధ, డీటీ హీరాలాల్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, ప్రకాశ్, ఈశ్వర్, లక్ష్మణ్, పరచ లావణ్య, లక్ష్మి, గంగాపూర్ సర్పంచ్ శ్రీరాం పాల్గొన్నారు.

'ప్రమాదాల నివారణే ధ్యేయం'


అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

ఆదిలాబాద్: ప్రమాదాల నివారణే ధ్యేయంగా డ్రైవర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ కల్పన తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణం శిక్షణ కేంద్రంలో శుక్రవారం చోల ఎంఎస్ రిస్క్ సర్వీస్ ఆధ్వర్యంలో శిక్షణ శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ప్రమాదాల నివారణ, ఘాట్ ప్రాంతాల్లో సురక్షితమైన డ్రైవింగ్, ప్రమాద సూచికల గురించి అవగాహన కల్పించారు. ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడమే ఆర్టీసీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో చోల ఎంఎస్ రిస్క్ సర్వీస్ ప్రాజెక్టు మేనేజర్ సుబ్బారావు, శిక్షకులు ప్రేమ్‌నాథ్, సుధాకర్, మురళీ, ఫిజియోథెరపిస్ట్ చందు, రిజర్వేషన్ ఇన్‌చార్జి హుస్సేన్ పాల్గొన్నారు.

అపరిచిత కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలి

బజార్‌హత్నూర్: అపరిచిత కాల్స్‌పై అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పవద్దని సీఐ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని అనంతపూర్‌లో సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని, ఫోన్‌కు వచ్చే లింకులను ఓపెన్ వద్దని సూచించారు. యువత చెడు వ్యసనాలకు, మత్తుకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సయ్యద్ ముజాహిద్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు కైలాస్, సర్పంచ్ నగేశ్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండా ఏర్పాటుకు కసరత్తు


కొలతలు తీసుకుంటున్న కంపెనీ ప్రతినిధులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం వద్ద ఎన్టీటీ డాటా ఆధ్వర్యంలో 150 అడుగుల జాతీయ జెండా ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. ఈమేరకు కంపెనీ ప్రతినిధులు శుక్రవారం కొలతలు తీసుకున్నారు. వీరికి మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు సహకరించారు. పనులను త్వరతగతిన పూర్తి చేస్తామని కంపెనీ ప్రతినిధి శ్రీకాంత్ తెలిపారు. జాతీయ జెండా కోసం ఆర్డర్ ఇచ్చామన్నారు. రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు.

పోడు పట్టాలు పంపిణీ


పట్టాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాస్

తలమడుగు: మండలంలోని ఝరీ గ్రామంలో పోడు పట్టాలను జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏళ్లుగా పోరాటం చేస్తే నేడు న్యాయం జరిగిందన్నారు. ఝరి గ్రామంలో 106 మంది గిరిజనులకు పోడు పట్టాలు అందించామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దివ్య మాధవ్, సర్పంచ్ రఘునాథ్, ఎంపీవో దిలీప్, ఏఈవో రమేశ్, జనక్ పటేల్, శ్రీనివాస్‌రెడ్డి, వినోద్ పాల్గొన్నారు.
బోథ్: మండలంలోని పిప్పల్‌ధరి, నక్కలవాడ గ్రామాల్లో ఎంపీపీ తుల శ్రీనివాస్ పోడు పట్టాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పోడు పట్టాల కోసం రైతులు ఇబ్బంది పడ్డారని, సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం పోడు భూములకు పట్టాలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుశీల్ రెడ్డి, పిప్పల ధరి సర్పంచ్ శ్రీధర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, నాయకులు పాల్గొన్నారు.


నేరడిగొండ: నిరసన తెలుపుతున్న నాయకులు


బోథ్: సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మికులు


జైనథ్: ఎంపీడీవో కార్యాలయం ఎదుట..

సమస్యలు పరిష్కరించాలి

జిల్లా వ్యాప్తంగా పంచాయతీ కార్మికులు సమ్మెబాట పట్టారు. తమ సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం ఆందోళన నిర్వహించారు. కనీస వేతనం రూ. 26వేలు అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులుగా, సహాయ పంచాయతీ కార్యదర్శులుగా, బిల్ కలెక్టర్‌లుగా పదోన్నతి ఇవ్వాలన్నారు. ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల వద్ద నిరసన తెలిపి, అధికారులకు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్మికుల సమ్మెకు పలువురు రాజకీయ నాయకులు మద్దతు తెలిపారు. - సాక్షి, నెట్‌వర్క్


ఇచ్చోడ: సమ్మెలో పాల్గొన్న కార్మికులు

'బయోమెట్రిక్'తోనే ఎరువులు విక్రయించాలి


స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న అధికారి

తాంసి: బయోమెట్రిక్ విధానంతోనే రైతులకు ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని బండల్‌నాగాపూర్, జామిడి గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను పరిశీలించారు. బండల్‌నాగాపూర్ రైతువేదికలో రైతులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేసి పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం పాలోది గ్రామంలోని పంటచేల్లో భాస్వరాన్ని కరిగించే బ్యాక్టీరియా వాడకంపై అవగాహన కల్పించారు. ఇన్‌చార్జి ఏడీఏ రవీందర్, ఏఈవోలు శివప్రసాద్, వెంకట్, సర్పంచ్‌లు వెంకన్న, శంకర్, కేశవ్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, నరేందర్, నాగారెడ్డి పాల్గొన్నారు.